జిల్లాకు 17 వేల దోమతెరలు

పలు పరిశ్రమల వితరణ

తొలి విడత వరద ప్రభావిత ప్రాంతానికి తరలింపు

మిగతా ప్రాంతాల్లోనూ త్వరలో పంపిణీ

కలెక్టర్ దినేశ్‌కుమార్

వార్త 8వ పేజీలో..

పనితీరు మారకపోతే కఠిన చర్యలు

- ఏటీడబ్ల్యూవోలకు ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరిక
- జాముగూడ, బందవీధి ఘటనల నేపథ్యంలో ప్రత్యేక సమావేశం
- ఆశ్రమాల్లో వంటల ఫొటోలను వాట్సాప్‌లో పంపాలని ఆదేశం
- విద్యార్థులకు నాణ్యమైన భోజన మెనూ అమలు చేయాలని సూచన


ఏటీడబ్ల్యూవోలతో సమావేశమైన ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ విద్యను పర్యవేక్షించే సహాయ గిరిజన సంక్షేమాధికారుల(ఏటీడబ్ల్యూవోలు) పనితీరు మారకపోతే కఠిన చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఘాటుగా హెచ్చరించారు. డుంబ్రిగుడ మండలం జాముగూడలో బాలికలు కలుషిత ఆహార ఘటన, జి.మాడుగుల మండలం బందవీధిలో ఇద్దరు బాలికలు అదృశ్యం నేపథ్యంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖలో పర్యవేక్షణ లోపాలపై 'అటకెక్కిన ఆశ్రమాల నిర్వహణ' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ఐటీడీఏ పీవో అభిషేక్ స్పందించారు. ఈ మేరకు స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఏజెన్సీలోని ఏటీడబ్ల్యూలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సహాయ గిరిజన సంక్షేమాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఫలితంగానే ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణ గాడి తప్పుతున్నదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. డుంబ్రిగుడ మండలం జాముగూడ, జి.మాడుగుల మండలం బందవీధి సంఘటనలే ఏటీడబ్ల్యూవోల పని తీరుకు అద్దం పడుతున్నాయన్నారు. 'మీ పిల్లలకే ఇలా జరిగితే మీరు ఊరుకుంటారా?' అని వారిని ఐటీడీఏ పీవో ప్రశ్నించారు. ఇకపై ఆశ్రమ పాఠశాలల్లో మూడు పూటలా వండుతున్న వంటకాల ఫొటోలను వాట్సాప్‌లో విధిగా షేర్ చేయాలని ఆదేశించారు. పాడేరు ఐటీడీఏకు రాష్ట్రంలో చాలా మంచి పేరుందని, దానిని చెడగొడుతున్నారని అభిషేక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజన మెనూ అమలు చేయాలని, దానిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. గిరిజన విద్యార్థుల పొట్టకొట్ట వద్దని ఆయన హితవు పలికారు. ఆశ్రమ పాఠశాలలో పేద గిరిజన విద్యార్థులు చదువుకుంటారని, వారికి తగిన పోషకాహారం అందించాలన్నారు.

డీడీ కార్యాలయంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

గిరిజన సంక్షేమ విద్యాశాఖలో అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో అభిషేక్ హెచ్చరించారు. టీడబ్ల్యూ డీడీ కార్యాలయంలో ఫైళ్లు పంపడానికి అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయని, అటువంటి వారిపై కఠినంగానే వ్యవహరిస్తామన్నారు. డీడీ కార్యాలయ సిబ్బందిపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇకపై ఫైళ్లు పంపడంలో జాప్యం చేయడాన్ని సహించేది లేదని పీవో హెచ్చరించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు, ఏజెన్సీ 11 మండలాలకు చెందిన ఏటీడబ్ల్యూవోలు, డీడీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ఆందోళన

- సమస్యలు పరిష్కరించాలని రోడ్డుపై బైఠాయింపు
- ఉడకని అన్నం, కూరలు పెడుతున్నారు
- మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు
- ప్రశ్నిస్తే కొడుతున్నారు
- మా గోడు వినేవారే లేరంటూ బాలికల ఆవేదన
- పాఠశాల ప్రత్యేక అధికారిణిని మార్చాలని డిమాండ్
- ఎంపీడీవో, ఎస్‌ఐ సర్ది చెప్పడంతో నిరసన విరమణ


రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 4: మండలంలోని కిలగాడ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులు బుధవారం ఆందోళన బాట పట్టారు. తమకు ఉడకని అన్నం, కూరలు పెడుతున్నారని, మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని, ప్రశ్నిస్తే కొడుతున్నారని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు.

కిలగాడ కేజీబీవీలో కొద్ది రోజులుగా భోజన మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు. ఉడకని అన్నం, కూరలు పెడుతున్నారని వాపోతున్నారు. మరుగుదొడ్ల మరమ్మతు పనులు చేపట్టాలని, పాఠశాల ప్రత్యేక అధికారిణి జ్యోతి, అకౌంటెంట్ పుష్పవతిలు తమకొద్దంటూ రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు బాలికలు మాట్లాడుతూ సుమారు వారం రోజులుగా అధ్వానమైన భోజనం పెడుతున్నారని, మెనూపై ప్రశ్నిస్తే తమపై దురుసుగా ప్రవర్తిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడం, మరుగుదొడ్ల సమస్యతో నిత్యం అవస్థలు పడుతున్నామని, తనిఖీలకు వచ్చే అధికారులు తమతో మాట్లాడకుండా, తమ సమస్యలు తెలుసుకోకుండా, ఉపాధ్యాయులతో మాట్లాడి, భోజనాలు చేసి వెళ్లిపోతున్నారని వారు ఆరోపించారు. తమ సమస్యలు వినేవారు, పట్టించుకునేవారు ఎవరూ లేకపోవడంతో సమస్యల పరిష్కారం కోసం దిక్కుతోచని పరిస్థితిలో రోడ్డెక్కాల్సి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులను తల్లిదండ్రులకు చెప్పొద్దంటూ ప్రత్యేక అధికారిణి బెదిరిస్తున్నారని ఆరోపించారు. పాఠశాల ప్రత్యేక అధికారిణి జ్యోతి, అకౌంటెంట్ పుష్పవతిలను మార్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో అందరం ఇళ్లకు వెళ్లిపోతామని, తమ బాధను కలెక్టర్‌కు చెబుతామని, అప్పటి వరకు ఆందోళన విరమించేది లేదని తెలిపారు. ప్రత్యేక అధికారిణితో పాటు ఉపాధ్యాయులు వచ్చి బాలికలను సముదాయించినా వారు ఆందోళన విరమించలేదు. సీపీఎం మండల నేతలు క్షేత్రినాథ్, ఎం.ఎం.శ్రీనులు బాలికల ఆందోళనకు మద్దతు తెలిపారు. బాలికల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఎస్‌ఐ రవీంద్రలు ఆందోళన చేస్తున్న బాలికలతో మాట్లాడి సర్ది చెప్పారు. సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీ ఇవ్వడంతో బాలికలు శాంతించి ఆందోళన విరమించారు. అనంతరం వారు పాఠశాలకు వెళ్లి అక్కడ నెలకొన్న సమస్యలను బాలికలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, ఎస్‌ఐలు మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక అధికారిణితో పాటు ఉపాధ్యాయులతో మాట్లాడామన్నారు. ఈ విషయంపై ప్రత్యేక అధికారిణి జ్యోతిని విలేకరులు వివరణ కోరగా మెనూ ప్రకారం భోజనం పెడుతున్నామని, అప్పుడప్పుడు సరకులు రావడం ఆలస్యం అయితే చిన్నపాటి ఇబ్బందులు వస్తున్నాయని, బాలికలను బాగానే చూసుకుంటున్నామన్నారు.


బాలికల ఆరోపణలపై విచారణ చేపడుతున్న జీసీడీవో, ఎంపీడీవో, ఇతర అధికారులు

సమస్యల పరిష్కారానికి కృషి

కిలగాడ కేజీబీవీలో నెలకొన్న సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీవో)సూర్యకుమారి తెలిపారు. బుధవారం ఆమె పాఠశాలను సందర్శించారు. ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఎస్‌ఐ రవీంద్ర, ఎంపీపీ సీతమ్మల సమక్షంలో విచారణ చేపట్టారు. తరగతుల వారీగా బాలికలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ సక్రమంగా అమలు కావడం లేదని, ప్రత్యేక అధికారిణి జ్యోతి, అకౌంటెంట్ పుష్పవతిలు తమకు వద్దని, మెనూపై ప్రశ్నిస్తే తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఇంటి బాట పడతామని బాలికలు ఆమెకు తెలిపారు. అనంతరం ప్రత్యేక అధికారిణి, అకౌంటెంట్‌లతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని, బాలికలు ఆందోళన చేయాల్సిన అవసరం లేదని, ఇక్కడ నెలకొన్న పరిస్థితులపై నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని చెప్పారు.



పాడేరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం

కొత్త సార్ ఎప్పుడొస్తారో?

- సబ్‌కలెక్టర్ రాకకు ఎదురుచూపులు
- 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సౌర్యమన్ పటేల్ సబ్‌కలెక్టర్‌గా నియామకం
- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి పది రోజులైనా విధుల్లో చేరని వైనం
- రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీని నియమిస్తారని ప్రచారం


సౌర్యమన్ పటేల్

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

స్థానిక సబ్‌కలెక్టర్‌గా 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సౌర్యమన్ పటేల్‌ను నియమించి పది రోజులవుతున్నప్పటికీ ఆయన విధుల్లో చేరలేదు. దీంతో కొత్త సార్ ఎప్పుడొస్తారోనని రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఎదురు చూస్తున్నారు. అయితే ఆయన సబ్‌కలెక్టర్‌గా విధుల్లో చేరుతారా?, లేక మరెవరినైనా నియమిస్తారా? అనే దానిపై స్పష్టత లేకుండా పోయింది.

స్థానిక సబ్‌కలెక్టర్‌గా పని చేసిన పి.ధాత్రిరెడ్డి ఈ ఏడాది జూలైలో ఏలూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. దీంతో ... మిగతా 8వ పేజీలో

చింతపల్లి డిగ్రీ కళాశాలలో పీజీ స్టడీ సెంటర్

- తొలి ఏడాది ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సు
- 30 సీట్లు కేటాయించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం
- ఈ ఏడాది నుంచే విద్యా బోధన ప్రారంభం
- విద్యార్థినీ, విద్యార్థులకు అందుబాటులో పోస్టుమెట్రిక్ వసతి గృహం

చింతపల్లి, సెప్టెంబరు 4: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్(పీజీ) స్టడీ సెంటర్‌ను మంజూరు చేసింది. తొలి ఏడాదికిగానూ ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్ కోర్సును కేటాయించారు. ప్రథమ సంవత్సరానికి 30 సీట్లు మంజూరు చేశారు. డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది నుంచే విద్యాబోధన ప్రారంభించేందుకు విశ్వవిద్యాలయం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గిరిజన ప్రాంతంలో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సు అందుబాటులోకి రావడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చింతపల్లిలో 15 ఏళ్ల క్రితం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 25 ఎకరాల సువిశాలమైన ప్రాంగణంలో డిగ్రీ కళాశాల నిర్మించారు. తాజాగా అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్సు, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ జువాలజీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ బీఏ హిస్టరీ, బీఏ ఎకనామిక్స్ కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సుల్లో ప్రథమ సంవత్సరానికి 480 సీట్లు కేటాయించగా, ఈ ఏడాది 90 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో సుమారు


పీజీ విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు సిద్ధం చేసిన కంప్యూటర్ ల్యాబ్



పీజీ స్టడీ సెంటర్ మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల

1,250మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పీజీ చేసేందుకు మైదాన ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సీట్లు లభించని విద్యార్థులు ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తున్నారు. దీంతో గిరిజన ప్రాంతంలో పీజీ స్టడీ సెంటర్ కేటాయించాలని ఈ ప్రాంత ఆదివాసీ విద్యార్థులు కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లోనూ పీజీ సెంటర్లు ఏర్పాటు చేయాలని విశ్వవిద్యాలయం అధికారులకు సూచనలు చేసింది. ఈ క్రమంలో జిల్లాలో కేవలం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మాత్రమే ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్ కోర్సును మంజూరు చేసింది.

ఈ ఏడాది నుంచే ప్రవేశాలు

చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది నుంచే ప్రవేశాలు కల్పించేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా పోస్టు గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు వెబ్ ఆప్షన్‌లో చింతపల్లి స్టడీ సెంటర్‌ను ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ ప్రథమ సంవత్సరానికి 30 సీట్లు కేటాయించారు. ఈ సీట్లు పొందేందుకు గిరిజన ప్రాంత విద్యార్థుల నుంచి మంచి పోటీ ఏర్పడే అవకాశం ఉన్నది. చింతపల్లి డిగ్రీ కళాశాల నుంచే ప్రతి ఏడాది 60 మంది విద్యార్థులు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి బయటకొస్తున్నారు. అరకు, పాడేరు కళాశాలల్లో మరో 120 మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసుకుంటున్నారు. ఈ కోర్సు చదివిన విద్యార్థులతో పాటు ఇతర కోర్సులు చదివిన విద్యార్థులు సైతం ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో చేరేందుకు పోటీ పడే అవకాశం ఉన్నది.

కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు

పీజీ ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల విద్యా బోధన, ప్రాక్టికల్స్ చేసేందుకు కంప్యూటర్ ల్యాబ్ కోసం రెండు గదులను కళాశాల యాజమాన్యం, అధికారులు సిద్ధం చేశారు. ఇప్పటికే ఉన్నత విద్యా మండలి కమిషనర్ చింతపల్లి కళాశాలకు 20 కంప్యూటర్లు మంజూరు చేశారు. మరో 30 కంప్యూటర్లు కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు. కళాశాలలో గ్రంథాలయం కూడా అందుబాటులో ఉన్నది. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులో చేరిన విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించేందుకు కళాశాల యాజమాన్యం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నది. ప్రస్తుతం కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు ఒకరు అందుబాటులో ఉన్నారు. మరో ఇద్దరు గెస్ట్ ఆచార్యులను పీజీ విద్యాబోధనకు నియమించుకునేందుకు ఉన్నత విద్యామండలి అనుమతించింది.

అందుబాటులో వసతి గృహాలు

చింతపల్లి పీజీ సెంటర్‌లో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులో చేరే విద్యార్థులకు పోస్టుమెట్రిక్ వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయి. పాడేరు ఐటీడీఏ నిర్వాహణలోనున్న బాలికలు, బాలుర వసతి గృహాల్లో పీజీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. పీజీలో చేరిన విద్యార్థులకు ఉచిత భోజన, వసతి కల్పిస్తారు. కళాశాల ఆవరణలోనే బాలికలు, బాలురకు వేర్వేరుగా వసతి గృహాలు ఉన్నాయి.

భవిష్యత్తులో మరిన్ని పీజీ కోర్సులు



చింతపల్లి డిగ్రీ కళాశాలకు భవిష్యత్తులో మరిన్ని పీజీ కోర్సులు మంజూరు చేసేందుకు విశ్వవిద్యాలయం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తొలి విడతగా ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సు మంజూరు చేశారు. వచ్చే ఏడాదికి ఎంఏ హిస్టరీ, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ తెలుగు కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. కళాశాలలో డిగ్రీ, పీజీ కోర్సులకు అవసరమైన తరగతి గదులు, ల్యాబ్‌ల నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. వచ్చే ఏడాదికి అదనపు తరగతి గదులు అందుబాటులోకి వస్తాయి. గిరిజన ప్రాంత విద్యార్థులు ఏజెన్సీలోనే పీజీ చేసే సువర్ణ అవకాశం కలగనున్నది.

-డాక్టర్ ఎం.విజయ భారతి, ప్రిన్సిపాల్, డిగ్రీ కళాశాల, చింతపల్లి



ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ అసంతృప్తి

ఫార్మసిస్టు, పారిశుధ్య కార్మికుడికి షోకాజ్ నోటీసులు

హుకుంపేట, సెప్టెంబరు 4: హుకుంపేటలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పారిశుధ్య నిర్వహణపై కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆయన హుకుంపేట పీహెచ్‌సీని సందర్శించి, వైద్యం అందుతున్న తీరు, పారిశుధ్య నిర్వహణపై ఆరా తీశారు. పనితీరు సంతృప్తిగా లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి ఫార్మసిస్టు, పారిశుధ్య వర్కర్‌కు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. తర్వాత అక్కడ ఏకలవ్య మోడల్ స్కూల్ భవనాల నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని పరిశీలించి, ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న స్థలం సేకరిస్తే బాగుండేదన్నారు. అనంతరం స్థానిక ఆశ్రమ పాఠశాలను సందర్శించి, అక్కడి పరిస్థితులపై విద్యార్థులతో మాట్లాడి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రోణంకి వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

డెంగ్యూ మృతిపై విచారణ

వివరాలు సేకరించిన జేసీ

పాడేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం సంభవించిన డెంగ్యూ మరణంపై జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్ బుధవారం విచారణ ప్రారంభించారు. స్థానిక డెంగ్యూ మరణంపై కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాలతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో జేసీ అభిషేక్‌గౌడ్ విచారణ చేపట్టారు. మృతునికి ఆస్పత్రిలో అందించిన వైద్య సేవలు, పరీక్షలు, తదితర విషయాలపై వైద్యులు, సిబ్బందిని ఆయన విచారించారు. డెంగ్యూ మరణంపై విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్ బాషా, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌గౌడ్

క్రైం... crime news

పెద్దేరులో గల్లంతైన వృద్ధుడి మృతి


నదిలో నుంచి మృతదేహం తీసుకొస్తున్న యువకులు

చోడవరం, సెప్టెంబరు 4: మండలంలోని గౌరీపట్నంలో మంగళవారం మధ్యాహ్నం పెద్దేరు నదిలో ప్రవాహ ఉధృతికి కొట్టుకొనిపోయిన వృద్ధుడు ఆకుల నాగరాజు (62) మృతి చెందాడు. అతడి మృతదేహం బుధవారం మధ్యాహ్నం లభ్యమైంది. పెద్దేరు నది ఆవల ఉన్న పొలాలకు వెళ్లేందుకు నది దాటే క్రమంలో నాగరాజు ప్రవాహ ఉధృతికి నదిలో గల్లంతైన సంగతి తెలిసిందే. నాగరాజు ఆచూకీ కోసం మంగళవారం మధ్యాహ్నం నుంచి అగ్నిమాపక సిబ్బంది, స్థానిక యువకులు గాలించినా ఫలితం కనిపించలేదు. అయితే గౌరీపట్నం యువకులు కొందరు నది వెంబడి గాలింపు చర్యలు కొనసాగించగా, చివరకు బెన్నవోలు గ్రామ సమీపంలో నాగరాజు మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని వెలికితీసి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 4: తీవ్ర గాయాలతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందినట్టు పట్టణ ఎస్‌ఐ ఎ.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. అనకాపల్లి మండలం సిరసపల్లికి చెందిన తెప్పల రమేష్ (42) మార్బుల్స్, భవన నిర్మాణ పనులు చేస్తుంటాడన్నారు. ఈ నెల రెండో తేదీ ఉదయం ఉడ్‌పేట వద్దకు పనుల కోసం రాగా, ఆయనకు ఫిట్స్ రావడంతో వెనుక ఉన్న ఐరన్ తలుపులపై పడి తీవ్ర గాయాలకు గురయ్యాడని ఎస్‌ఐ చెప్పారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రాథమిక చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు సమాచారం అందిందన్నారు. మృతుడి భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాలిక హత్య కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలు

విశాఖపట్నం (లీగల్), సెప్టెంబరు 4 : బాలికపై లైంగిక దాడికి పాల్పడి ఆమె మృతికి కారణమైన యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 50 వేలు జరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం జడ్జి ఆనంది బుధవారం తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. అలాగే బాధితురాలి కుటుంబ సభ్యులకు నిందితుడు రూ.1.50 లక్షలు ఇవ్వాలని, ప్రభుత్వం రూ. 3 లక్షలు ఇవ్వాలని ఆదేశించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. బాధితురాలు (13) తన కుటుంబ సభ్యులతో కలిసి దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక అపార్టమెంట్‌లో నివసిస్తున్నారు. అక్కడికి సమీపంలోనే దిగుమర్తి నరేష్ (28) కార్పెంటర్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో బాలికకు నరేష్‌తో పరిచయం ఏర్పడింది. అది శారీరక సంబంధానికి దారి తీసింది. 2021 అక్టోబరు 5న రాత్రి నరేష్ ఫోన్ చేయడంతో బాలిక అతని రూమ్‌కు వెళ్లింది. ఈలోపు బాలిక కనిపించలేదని ఆమె తండ్రి చుట్టుపక్కల వెతకడం ప్రారంభించాడు. గమనించిన నరేష్ బాలికను తన గది వెనుక వైపు నుంచి బయటకు వెళ్లిపొమ్మని హెచ్చరించాడు. తల్లిదండ్రులకు భయపడిన బాలిక అదే అపార్టమెంట్‌పైకి వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకింది. తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో కేసును దర్యాప్తు చేసిన దువ్వాడ పోలీస్ అధికారులను న్యాయమూర్తి అభినందించారు.

ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 4: వరుస పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొన్ని ట్రిప్పులు కొనసాగించనున్నట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. వీటిలో కొచువేలి-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (06081) ఈనెల 20 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 4.20 గంటలకు కొచువేలిలో బయలుదేరి మర్నాడు రాత్రి 10.52 గంటలకు దువ్వాడ, ఆదివారం మధ్యాహ్నం 1.40 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి (06082) నంబరు గల రైలు ఈనెల 23 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి సోమవారం మధ్యాహ్నం 2.20 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 4.18 గంటలకు దువ్వాడ, బుధవారం ఉదయం 9.55 గంటలకు కొచువేలి చేరుతుంది.

తిరునెల్వేలి-షాలిమార్ ఎక్స్ ప్రెస్ (06087) ఈనెల 12 నుంచి నవంబరు 28 వరకు ప్రతి గురువారం తెల్లవారుజాము 1.50 గంటలకు తిరునెల్వేలిలో బయలుదేరి మర్నాడు ఉదయం 4.47 గంటలకు దువ్వాడ, రాత్రి 9.00 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరిగి ఈనెల 14 నుంచి నవంబరు 30 వరకు ప్రతి శనివారం సాయంత్రం 5.10 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 7.52 గంటలకు దువ్వాడ, సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు తిరునెల్వేలి చేరుతుంది. కొయంబత్తూరు-బరౌని ఎక్స్‌ప్రెస్ (06059) ఈనెల పది నుంచి నవంబరు 26 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.50 గంటలకు కొయంబత్తూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ, మర్నాడు మధ్యాహ్నం 2.30 గంటలకు బరౌని చేరుతుంది. అలాగే, ఈ ఎక్స్‌ప్రెస్ (06060) ఈనెల 13 నుంచి 29వ తేదీ వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటలకు బరౌనిలో బయలుదేరి ఆదివారం ఉదయం 3.48 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 3.45 గంటలకు కొయంబత్తూర్ చేరుతుంది. ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్ (06085) ఈనెల 13 నుంచి 29 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11.00 గంటలకు ఎర్నాకులంలో బయలుదేరి మర్నాడు రాత్రి 11.03 గంటలకు దువ్వాడ, సోమవారం ఉదయం 3.30 గంటలకు పాట్నా చేరుతుంది. తిరిగి ఈనెల 16 నుంచి డిసెంబరు 2 వరకు ప్రతి సోమవారం రాత్రి 11.45 గంటలకు పాట్నాలో బయలుదేరి బుధవారం తెల్లవారుజాము 1.05 (మంగళవారం అర్ధరాత్రి) దువ్వాడ, గురువారం ఉదయం 10.30 గంటలకు ఎర్నాకులం చేరుతుంది.

దువ్వాడ మీదుగా మరికొన్ని ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దువ్వాడ మీదుగా షాలిమార్, చెన్నై సెంట్రల్, సంత్రాగచ్చి, సికింద్రాబాద్ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే.సందీప్ తెలిపారు. షాలిమార్-చెన్నై సెంట్రల్-షాలిమార్ 02841 నంబరు గల రైలు ఈనెల 30 నుంచి నవంబరు 18 వరకు ప్రతి సోమవారం ఉదయం 8.30 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 8.08 గంటలకు దువ్వాడ, మంగళవారం రాత్రి 11.20 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుతుంది. తిరిగి అక్టోబరు ఒకటి నుంచి నవంబరు 20 వరకు ప్రతి బుధవారం ఉదయం 4.30 గంటలకు చెన్నైలో బయలుదేరి అదేరోజు రాత్రి 7.30 గంటలకు దువ్వాడ, గురువారం ఉదయం 11.20 గంటలకు షాలిమార్ చేరుతుంది

సంత్రాగచ్చి-సికింద్రాబాద్-సంత్రాగచ్చి.. 08845 నంబరు గల రైలు అక్టోబరు నాలుగు నవంబరు 15 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.55 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు ఉదయం 3.55 గంటలకు దువ్వాడ, శనివారం సాయంత్రం 6.40 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. తిరిగి అక్టోబరు ఐదు నుంచి నవంబరు 16 వరకు ప్రతి శనివారం రాత్రి 7.50 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 7.40 గంటలకు దువ్వాడ, రాత్రి 11.55 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది.

నేడు తిరువనంతపురం, షాలిమార్ రైలు రద్దు

జత రేక్ కొరత నేపథ్యంలో వయా విశాఖ మీదుగా తిరువనంతపురం నుంచి షాలిమార్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ (22642) రైలును గురువారం రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం తెలిపారు. కాగా విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739), సికింద్రాబాద్-విశాఖ గరీబ్‌రథ ఎక్స్‌ప్రెస్ (12740), చెన్నై సెంట్రల్-హౌరా మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12840) రైళ్లు బుధవారం (4న) రద్దయ్యాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

వినాయక విగ్రహాలకు ఖ్యాతిగాంచిన చౌడువాడ


వివిధ ఆకృతులలో గణనాథుడు

- వివిధ రూపాల్లో గణేషుడి ప్రతిమలు
- మూడు కుటుంబాలకు చెందిన కళాకారుల ప్రతిభ
- తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి గిరాకీ

కె.కోటపాడు, సెప్టెంబరు 4 : ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆకర్షణీయమైన వినాయక బొమ్మల తయారీ ఎక్కడ అంటే.. అది కె. కోటపాడు మండలం చౌడువాడ అని చెబుతారు. అంతటి పేరు సంపాదించుకున్నారు అక్కడి మూడు కుటుంబాలకు చెందిన కళాకారులు. ఈ నెల 7న వినాయకచవతి. ఏ వీధిలో చూసినా గణనాథుని విగ్రహాలతో కూడిన మండపాలే దర్శనమిస్తాయి. ఇంచుమించు ఈ పరిసరాల్లో కనిపించే ఈ విగ్రహాలన్నీ తయారయ్యేది చౌడువాడలోనే అంటే అతిశయోక్తి కాదు. వినాయకవిగ్రహాల తయారీలో ఈ గ్రామానికి రాష్ట్ర స్థాయిలో పేరుంది. ఇక్కడ వివిధ రకాలు భంగిమల్లో రంగురంగులతో ఆకర్షణీయంగా వినాయక విగ్రహాలను రూపొందిస్తారు. రాజమండ్రి, అమలాపురం, పిఠాపురం, పాలకొల్లు, విశాఖ తదితర ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు కూడా ఎగుమతి అవుతుంటాయి. చౌడవాడకు చెందిన మాకారపు ఈశ్వరరావు, ఉరుము ఈశ్వరరావు, మాకారపు శంకరరావు వినాయక విగ్రహాల తయారీలో ఘనతకెక్కారు. అడుగు ఎత్తు నుంచి 15 అడుగుల ఎత్తు వరకు రూపాల్లో తయారయ్యే విగ్రహాలు రూ.వెయ్యి నుంచి 20 వేల రూపాయల వరకు ధర పలుకుతాయి.


పంచముఖ ఆంజనేయస్వామి రూపంలో గణపతి


చౌడువాడలో వినాయక విగ్రహాలకు రంగులద్దుతున్న దృశ్యం

ప్రభుత్వ సహకారం అవసరం



పదేళ్లుగా ఇదే వృత్తిలో జీవనం సాగిస్తున్నాను. విగ్రహాలకు అద్దే రంగుల దగ్గర నుంచి వివిధ రకాల మెటీరియల్స్ విపరీతంగా ధరలు పెరిగిపోయాయి. అధిక లాభం లేకపోయినా పది మందికీ ఉపాధి కల్పిస్తున్నానన్న సంతోషం మాత్రం మిగుతులోంది. ఈ సమయంలో పెయింటర్స్‌కు పూర్తి స్థాయిలో పని దొరుకుతుంది. ఈ పరిశ్రమకు ప్రభుత్వం రాయితీపై రుణాలు అందజేసి ఆదుకోవాలి.

\- మాకారపు ఈశ్వరరావు,
విగ్రహాల తయారీదారుడు







శివ పార్వతులతో వినాయకుడు

'కొక్కిరాపల్లి' నువ్వు వంగడానికి త్వరలో జాతీయస్థాయి గుర్తింపు

- ఇప్పటి వరకు ఇక్కడి నుంచి ఐదు రకాల వంగడాలు రాష్ట్రస్థాయిలో విడుదల
- నూతన రకం వైఎల్ఎం-146 ద్వారా అరుదైన కీర్తి
- వివరాలు వెల్లడించిన ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు


కొక్కిరాపల్లి పరిశోధనా కేంద్రంలోని కొత్త రకం వంగడాలు


వైఎల్ఎం-146 రకం నువ్వు పంట

ఎలమంచిలి, సెప్టెంబ 4 : జిల్లాలోని ఎలమంచిలి సమీపం కొక్కిరాపల్లిలో గల ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం రూపొందించిన నూతన నువ్వు వంగడాలు వైఎల్ఎం-146కు త్వరలో జాతీయ స్థాయిలో గుర్తింపు రానుంది. త్వరలో ఇది విడుదల కానుంది. నువ్వు పంట, నువ్వు ఆధారిత పంటల సరళిపై సమగ్రమైన అభివృద్ధి చేసేందుకు 1960వ సంవత్సరంలో కొక్కిరాపల్లిలో ఏర్పాటు చేసిన ఈ పరిశోధనా స్థానం చరిత్రలో తొలిసారిగా జాతీయ స్థాయిలో గుర్తింపు రానుంది. ఇందుకు సంబంధించిన వివరాలను పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంటీజీఎస్ కుమారి, మరో శాస్త్రవేత్త డాక్టర్ ఏబీఎం శిరీషా బుధవారం వెల్లడించారు. ఈ ఏడాది జూలైలో కోయంబత్తూరులో జరిగిన నూనె గింజల యాన్యువల్ గ్రూప్ వర్క్‌షాపులో ఎంపిక నిమిత్తం ఇక్కడి నుంచి సెంట్రల్ కమిటీకి ఈ నూతన వంగడాన్ని పంపించారు. సదరు కమిటీకి 13 రకాలు నువ్వులు దేశవ్యాప్తంగా ఎంపికకు నామినేషన్లు వచ్చాయి. ఇందులో ఐదు రకాల నువ్వు గుర్తింపునకు రాగా, వీటిలో కొక్కిరాపల్లి పరిశోధనా స్థానంలో రూపొందించిన వైఎల్ఎం-146 రకం ఒకటి కావడం విశేషం. ఈ రకం జాతీయ స్థాయిలో జోన్-2కు ఎంపికకు గుర్తించారు. దీనిని త్వలో అధికారికంగా విడుదల చేయనున్నారు.

ఇప్పటి వరకూ విడుదల చేసిన రకాలు

ఇప్పటి వరకూ ఈ పరిశోధనా స్థానం నుంచి విడుదల చేసిన రకాలు ఇవి. 1974వ సంవత్సరంలో గౌరి, 1978లో మాధవి, 1993లో వరాహ, 1993లో గౌతమ్, 2009లో శారదా రకాలను రాష్ట్ర స్థాయిలో విడుదల చేశారు.

వైఎల్ఎం-146 రకం విశేషాలు

తొలిసారిగా జాతీయ స్థాయిలో వైఎల్ఎం-146 రకం విడుదల కానుంది. దీని పంట కాలం 80 నుంచి 85 రోజులు. ఎకరాకు 600 నుంచి 700 కేజీల దిగుబడి వస్తుంది. నూనె శాతం 49 ఉంటుంది. ముదురు గోధుమ రంగు రకాలమీద ఈ పరిశోధనా స్థానంలో ప్రయోగాలు చేయడం జరుగుతుంది. జాతీయ స్థాయిలో గుర్తింపు రానున్న వైఎల్ఎం-146 రకం సుమారు పది సంవత్సరాల పాటు శ్రమించి రూపకల్పన చేశామని, ఇందులో శాస్త్రవేత్తలు డాక్టర్ రాజబాపారావు, డాక్టర్ గంగాధర్, డా. శిరీషలు కృషి ఉందని వారు వివరించారు.

తేగాడ మోడల్ స్కూల్‌లో వసూళ్ల పర్వం!

- ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ.200 వరకు వసూలు
- బయటకు పొక్కడంతో కొందరికి వాపసు
- విచారణకు ఆదేశించామన్న డీఈవో

కశింకోట, సెప్టెంబరు 4: మండలంలోని తేగాడ మోడల్ స్కూల్‌లో వసూళ్ల పర్వం ఆలస్యంగా బయటపడింది. స్థానికులు, పాఠశాల విద్యార్థులు తెలిపిన వివరాలివి. తేగాడ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు 600 మంది ఉన్నారు. వీరిలో తొమ్మిది నుంచి పది, ఇంటర్మీడియట్ చదువుకునే వంద మంది విద్యార్థులకు వసతి గృహ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తోంది. పాఠశాల, కళాశాల ఆవరణలో ఉన్న మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించేందుకు ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ.200లు చొప్పున బలవంతపు వసూళ్లు చేసినట్టు సమాచారం. అయితే ఈ విషయం బయటకు పొక్కడంతో ప్రిన్సిపాల్ వీరిలో కొందరు విద్యార్థులకు వసూళ్లు చేసిన డబ్బులు తిరిగి ఇచ్చినట్టు తెలిసింది. ఉన్నతాధికారులు విచారణ జరిపి ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దాలని పలువురు కోరుతున్నారు.

దీనిపై డీఈవో వెంకటలక్ష్మమ్మను వివరణ కోరగా, తేగాడ మోడల్ స్కూల్‌లో అంశంపై విచారణ చేపడతామన్నారు. డిప్యూటీ డీఈవోను సమగ్ర విచారణ చేయాలని ఆదేశించినట్టు చెప్పారు. నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రతి గ్రామంలో హిందూ సమితి

- వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

మాడుగుల రూరల్, సెప్టెంబరు 4: ప్రతి గ్రామానికి హిందూ సమితి ఏర్పాటు చేయడం జరిగిందని, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ అన్నారు. జంపెన శివాలయం, కేజేపురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హిందూ సమితి సభ్యులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. విశ్వహిందూ పరిషత్ 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రతి గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి హిందూ పరిరక్షణ కోసం శ్రమిస్తున్నామన్నారు. హిందూ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని, ఈ విషయంలో యువత మరింత చొరవ చూపాలన్నారు. ఇతర మతాలను హిందూ మతం ఎప్పుడూ గౌరవిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీతారామ్, మండల కార్యదర్శి రాపేటి రామకొండారావు, శోభారాణి, సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భాద్రపద మాసంలో అప్పన్న ఆలయ వైదిక ఉత్సవాలు

సింహాచలం, సెప్టెంబరు 4: వరాహలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో బాధ్రపద మాసంలో పలు వైదిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. బుధవారం వారు ఒక ప్రకటన విడు దల చేశారు. ఈనెల 5న స్వర్ణ పుష్పార్చన, 6న తాయారు సన్నిధిలో సహస్రనామ కుంకుమార్చన, సాయంత్రం బేడా తిరువీధి, 8న స్వాతి నక్షత్ర హవనం, 9న శ్రీనమ్మాళ్వార్ తిరు నక్షత్ర పూజలు, 12న మనవాళ మహామునుల మాస తిరు నక్షత్ర పూజలు, 13న ఉదయం తయార్ సన్నిధిలో సహస్రనామ కుంకుమార్చన, స్వామివారి పవిత్రోత్సవాలు పురస్కరించుకుని సాయంత్రం అంకురార్పణ జరగనుంది. అలాగే 14న ఏకాదశి పవిత్రాదివాసం, పవిత్ర పవిష్ట, గ్రామ తిరువీధి, 15 పవిత్ర సమర్పణ, గ్రామ తిరువీధి, కొండదిగువ వేంకటేశ్వరస్వామి దేవళంలో సుదర్శన హవనం, 16న పూర్ణాహుతి, పవిత్ర విసర్జనం, ఆరాధన, తిరువీధి, 17న నృసింహ మాస జయంతి, ఏకాంత స్నపన తిరుమంజనం, పవిత్రోత్సవాల సమాప్తి, సాయంత్రపు తిరువీధి, 18న బాద్రపద మాస పూర్ణిమ గ్రామ తిరువీధి, 19న స్వర్ణ పుష్పార్చన, మహాలయ పక్ష ప్రారంభం, 20న అమ్మవారి సన్నిధిలో శుక్రవార కుంకుమ పూజలు, బేడా తిరువీధి, 22న స్వర్ణపుష్పార్చన, 23న మాధవధార వేణుగోపాలస్వామి సన్నిధిలో అష్టాక్షరీ మంత్ర హవనం, 26న స్వర్ణ పుష్పార్చన, సింహగిరిపై సీతారామస్వామి ఆలయంలో సంక్షిప్త రామాయణం, షడక్షరీ మంత్ర హవనం, 27న అమ్మవారి సన్నిధిలో సహస్ర కుంకుమార్చన, సాయంత్రం బేడా తిరువీధి, 28న బాద్రపదమాస బహుళపక్ష ఏకాదశి స్వర్ణ తులసీ దళార్చన, గ్రామతిరువీధి, 29న స్వర్ణ పుష్పార్చన, ఇతర వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

- నిర్వాహకులకు ఎస్పీ దీపిక సూచన


ఎం.దీపిక, ఎస్పీ

అనకాపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో అంతా నిర్వహించుకోవాలని ఎస్పీ ఎం. దీపిక బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. గణేశ్ మండపాలు, పందిళ్ల ఏర్పాటు, ఊరే గింపులకు తప్పనిసరిగా ఆయా పోలీసు స్టేషన్ల ద్వారా అనుమతి పొందాలని వివరించారు. ఉత్సవాలు నిర్వహించే ప్రాంతంలో కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని, సీసీ కెమెరాలు పనిచేసే విధంగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. మండపాల్లో రాత్రి వేళ దీపారాధన సమయంలో ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా పూర్తి జాగ్రత్తలు పాటించాలని వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో అశ్లీల నృత్యాలు, రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, ఉత్సవాల పేరుతో బలవంతంగా చందాలు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు తప్పవని, ఊరేగింపు సందర్భంగా బాణసంచా కాల్చరాదని స్పష్టం చేశారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలి


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్దేశించిన గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తిచేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం గృహ నిర్మాణ సంస్థ అధికారులతో ఏర్పాటైన సమీక్షలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 6,276 రూఫ్ లెవెల్‌లో ఉన్న గృహ నిర్మాణాలను వంద రోజుల్లో పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లబ్ధిదారులకు ఉపాధి హామీ కింద 90 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. చీడికాడ, అనకాపల్లి రూరల్, కోటవురట్ల, గొలుగొండ, అచ్యుతాపురం మండలాల ఏఈలు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో మెరుగైన పనితీరు కనబర్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ పీడీ వై.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, జీఎస్‌డబ్ల్యూఎస్ ప్రత్యేకాధికారి మంజులవాణి, గృహ నిర్మాణశాఖ ఈఈ, డీఈ, ఏఈలు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి మండలాల వారీగా సదరం క్యాంపులు

- ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 4: పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం ఎదురుగా గల బాలల సత్వర చికిత్సా కేంద్రంలో ఈ నెల 5వ తేదీ గురువారం నుంచి 17వ తేదీ వరకు మండలాల వారీగా దివ్యాంగులకు సదరం క్యాంపులు నిర్వహించనున్నామని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. తలసేమియా మేజర్, సికిల్ సెల్ వ్యాధి, తీవ్రమైన హిమోఫిలియా, ద్విపాక్షిక ఎలిఫెంట్‌యాసిస్ (బోధవ్యాధి), పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తి, మంచానికే పరిమితమైన వారు, వీల్‌చైర్‌కే పరిమితమైనవారు, తీవ్రమైన కండరాల క్షీణత కేసులు, ప్రమాద బాధితులు, చక్రాల కుర్చీ లేక మంచానికి పరిమితమైనవారు, తీవ్రమైన కిడ్నీ వ్యాధిగ్రస్తులు, బహుళ వైకల్యం లెప్రసీ వంటి వారు, కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేయించుకుని ఇలా అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి సదరం క్యాంప్‌లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అనంతరం సర్టిఫికెట్లు ఇవ్వనున్నామన్నారు. పైన తెలిపిన వాటిలో పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తి మంచానికి, వీల్‌చైర్‌కే పరిమితమైన, తీవ్రమైన కండరాల క్షీణత, ప్రమాద బాధితులు, చక్రాల కుర్చీ, మంచానికి పరిమితమైన వారు 80 శాతానికి పైబడిన సదరం సర్టిఫికెట్ తెచ్చుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు.

5వ తేదీన రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాల దివ్యాంగులకు సదరం క్యాంప్‌లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 6న పరవాడ, అనకాపల్లి మండలం, టౌన్, చోడవరం మండలాలు, 9న సబ్బవరం, కె.కోటపాడు, దేవరాపల్లి, 10న చీడికాడ, మాడుగుల, బుచ్చెయ్యపేట, 11న కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, 12న రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం, 13న నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం, 17న కోటవురట్ల, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల దివ్యాంగులకు సదరం క్యాంప్ నిర్వహించనున్నామని ఆయన వివరించారు. పూర్తి వివరాలకు ఎన్టీఆర్ వైద్యాలయంలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

పాడేరు సీఐగా దీనబంధు బాధ్యతలు


బాధ్యతలు స్వీకరించిన సీఐ

పాడేరు రూరల్, సెప్టెంబరు 4: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు సీఐగా దీనబంధు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. అనకాపల్లి మహిళా పోలీసు స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై పాడేరుకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన దేవరపల్లి నవీన్‌కుమార్ జిల్లాలోనే సీసీఎస్ విభాగానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన దీనబంధు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. పాడేరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

పీవీటీజీ గ్రామాల్లో సదుపాయాల కల్పనకు ప్రణాళిక

చింతపల్లి, సెప్టెంబరు 4: పీవీటీజీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు ఏంఓడీ వనసల ప్రసాద్ చెప్పారు. చౌడుపల్లి పంచాయతీ కొత్తగూడ గ్రామంలో బుధవారం జరిగిన జన్‌మన్ గ్రామసభలో ఎంపీడీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం జన్‌మన్ కార్యక్రమం ద్వారా పీవీటీజీ గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. పీవీటీజీలకు పక్కా గృహాలు, మరుగుదొడ్లు, సీసీ రోడ్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు పూర్తి స్థాయిలో అందిస్తున్నట్టు కృషి చేస్తామన్నారు. సాగులో ఉన్న ఆదివాసీ భూములకు హక్కు పత్రాలు జారీ చేస్తామని చెప్పారు. ప్రస్తుతం గ్రామంలో పీవీటీజీలకు అందుబాటులో ఉన్న సదుపాయాలు, అవసరమైన సదుపాయాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసేందుకు గ్రామ సభ ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో పీఎం జన్‌మన్ సంపూర్ణ స్థాయిలో అమలు చేసేందుకు పీవీటీజీలు సహకరించాలని కోరారు.

వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట

చింతపల్లి, సెప్టెంబరు 4: గిరిజనుల వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని టీడీపీ అరకు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి జెర్రా సత్యనారాయణ పడాల్ అన్నారు. యర్రవొమ్మలు ఆర్‌ఎస్‌కేలో గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ అరకు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి మాట్లాడుతూ నూతనంగా అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం తొలిసారిగా నాట్లకు ముందుగా రాజ్‌మా విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాట్లు సమయం దాటిపోయిన్న నెల తరువాత విత్తనాల కోసం ఎదురుచూడాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం విత్తనాలను 90 శాతం రాయితీపై అందజేస్తుందన్నారు. రైతులకు నాణ్యమైన దేశీయ రకం చింతపల్లి రెడ్ విత్తనాలు అందజేస్తుందన్నారు. రానున్న రోజుల్లోనూ రైతులకు సకాలంలో రాయితీపై ఎరువులు, విత్తనాలు అందజేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ లోత పండయ్య, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం చెల్లించాలి

చింతపల్లి, సెప్టెంబరు 4: కైలాసపట్నం కలుషిత ఆహార బాధిత విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం వెంటనే చెల్లించాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ కోరారు. బుధవారం బాధిత విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన గిరిజన సంఘం నాయకులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షలు, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకున్న బాధిత విద్యార్థులకు రూ.50 వేలు, తక్షణ సాయంగా రూ.5 వేలు అందజేస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. మృతుల కుటుంబాలకు నేడు చెక్కు జిల్లా కలెక్టర్ బాధిత కుటుంబాలకు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన

డీజిల్, పెట్రోల్ ధరలు నియంత్రించాలి

చింతపల్లి, సెప్టెంబరు 4: కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలు నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా సీపీఎం నాయకులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ జీఎస్‌టీ పరిధిలోకి తీసుకు రావాలన్నారు. నిత్యావసర ధరలు పెరిగిపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పేట్ల పోతురాజు, నాయకులు టిముబాబు, గొల్లోరి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

చింతపల్లి, ఆగస్టు 4: తుఫాన్ వర్షాల కారణంగా గృహాలు, ఆస్తులు నష్టపోయిన గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలని చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల ఎంపీపీ కోరాబు అనుషదేవి, బోయిన కుమారి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో ఏడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో ఆదివాసీల గృహాలు, ఆస్తులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే గిరిజన ప్రాంతంలో పర్యటించి నష్టపోయిన బాధితుల వివరాలు సేకరించాలన్నారు. గృహాలు, పశు సంపద నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం పరిహారం అందజేసి భరోసా ఇవ్వాలని కోరారు.

జాబ్‌మేళాలను వినియోగించుకోండి

పాడేరు రూరల్, సెప్టెంబరు 4: జాబ్‌మేళాలను గిరిజన ప్రాంత యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనము చిట్టిబ్బాయి కోరారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, జేకేసీ, సీఎంఎస్ లెబరేటరీ వారు స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభను కనబర్చిన 34 మంది కెమిస్ట్రీ విద్యార్థులు, విద్యార్థులను సీఎంఎస్ లేబరేటరీ వారు ఎంపిక చేశారన్నారు. అదే విధంగా జేకేసీ ఆధ్వర్యంలో వివిధ జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తామని కోఆర్డినేటర్ జి.భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఎస్ లేబరేటరీ ట్రైనర్ ఎల్.శరణ, లెబరేటరీ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, కెమిస్ట్రీ పూర్తి చేసిన 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

అరకులోయ, సెప్టెంబరు 4: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తభల్లుగుడ ఎంపీటీసీ సభ్యురాలు స్వాతి లక్ష్మీ మాట్లాడుతూ స్థానికంగా లభ్యమయ్యే కాయకూరలు, పిండి పదార్థాల్లో పౌష్టికాహారం సమకూరుతుందన్నారు. రాగులు, సామలు, తోటకూర, ఆకుకూరలు, రాజ్‌మా, చిక్కుళ్లు, బెండకాయలు, గోంగూర తదితర కూరల్లో పౌష్టికాహారం లభిస్తుందన్నారు. ఈ ఆహారం తీసుకుంటే ఆరోగ్యం ఎంతగానో మెరుగుపడుతుందని చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో పండించే మిటున్నిటీ ఆహారంగా తీసుకోవడంతో స్థానికుల్లో ఆరోగ్య శాతం మంది ఆరోగ్యం పాలుపడుతున్నారని వాపోయారు. ఈ విషయాన్ని అందరూ గ్రహించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 17 వేల దోమతెరలు

పలు పరిశ్రమల వితరణ
తొలి విడత వరద ప్రభావిత ప్రాంతాలకు తరలింపు : కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీగా జిల్లాకు వివిధ పరిశ్రమలు 17 వేల దోమ తెరలను వితరణగా అందించాయని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. తొలి విడతగా 2,500 దోమ తెరలను జిల్లాలోని వీఆర్‌పురం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు దోమ తెరలను అందించాలనే లక్ష్యంతో అనకాపల్లి జిల్లాలోని పలు పరిశ్రమల యజమానులతో చర్చించి రూ.37.4 లక్షల విలువైన 17 వేల దోమ తెరలను సమకూర్చామన్నారు. అందుకు అనకాపల్లి జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారం అందించారని, వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వివిధ పార్మా కంపెనీలు వాటిని కార్పొరేట్ సామాజిక బాధ్యతగా తమకు అందించాయని, వాటిని అవసరమైన వారికి పంపిణీ చేస్తామన్నారు. వీఆర్ పురం మండలానికి దోమతెరలను పంపిణీ చేసే వాహనాన్ని కలెక్టర్ దినేశ్ కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి బి.పద్మావతి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ టి.జమాల్ బాషా, జిల్లా మలేరియా అధికారిణి తులసి, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


దోమతెరలు తరలించే అంబులెన్స్‌కు జెండా ఊపుతున్న కలెక్టర్

వ్యాధుల నియంత్రణకు సమన్వయంతో పనిచేయండి

▸▸ ప్రత్యేకాధికారి బాలసుందరంబాబు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 4: గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేకాధికారి, ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బాలసుందరంబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అపిడెమిక్ సీజన్ కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీధులు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. మలేరియా అధికారులు ప్రతీ గృహానికి దోమల నివారణ మందు పిచికారీ చేయించాలని సూచించారు. డ్రై డే డేను పాటించేలా అవగాహనను చైతన్యం చేయాలని ప్రత్యేకాధికారి బాలసుందరంబాబు అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీఎం జన్‌మన్ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పక్కా గృహాల లబ్ధిదారులకు 90 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం అధికారులు ప్రతి కూలీకి వంద రోజులు పని కల్పించాలని ఆయన ఆదేశించారు. పని కల్పించలేదని కూలీల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు పంపిణీ చేస్తున్న ఉద్యాన పంట మొక్కలు సంరక్షించేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏఎస్ కుమార్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ భగవంతరావు, పీఆర్ ఏఈఈ జ్యోతిబాబు, సీడీపీవో లక్ష్మీదేవి, ఈవోపీఆర్‌డీ పాపారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి బాలసుందరంబాబు

స్పీకర్ అయ్యన్న జీవితం స్ఫూర్తిదాయకం

టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జీవితం యువత, నాయకులకుస్ఫూర్తిదాయకని తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. అయ్యన్నపాత్రుడు పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఇక్కడ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 26 ఏళ్ల ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన, 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మార్లు మంత్రిగా పనిచేశారన్నారు. నిత్యం ప్రజల సమస్యల పరిష్కారానికి పరితపించే ఆయన్ని సీఎం చంద్రబాబు అసెంబ్లీ స్పీకర్‌గా ఎంపిక చేయడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాకూరు వెంకటరమణరాజు, పాండురంగస్వామి, సాగర సుబ్బారావు, శెకిమహుజీ, సత్యనారాయణ, మురళీ, అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలను పూజించండి

అరకులోయ, సెప్టెంబరు 4: మట్టితో చేసిన వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలని అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్ కోరారు. డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, సిబ్బందికి బుధవారం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాలతో పర్యావరణం కలుషితం కాకుండా ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కెప్టెన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని నాశనం చేసే విగ్రహాల కంటే పర్యావరణహిత విగ్రహాలు ఎంతో మేలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, ఆనితకుమారి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.కిరణ్‌బాబు, అధ్యాపకులు గణేశ్, సుందరిరాజు, రాజు, లచ్చన్న, కామేశ్, అప్పారావు, సోంబాబు, అంబికా పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

పాడేరు రూరల్, సెప్టెంబరు 4: మోదకి కిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కూడలిలో బుధవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు అన్నారు. పదకొండు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్న మోద కిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి శ్రీనివాస్ కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది 1500 మట్టి విగ్రహాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.కోటిబాబు, డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు, బోనంగి రమణ, ట్రస్టు ప్రతినిధులు టీవీఎస్.ముకుందరావు, సిద్ధిరాతి కొండలరావు, ఉప్పల వెంకటేశ్వరరావు, కారం దేముడు పాల్గొన్నారు.

రహదారులపై తిరుగుతున్న పశువుల స్వాధీనం

పాడేరు రూరల్, సెప్టెంబరు 4: జిల్లా కేంద్రం పాడేరు ప్రధాన రహదారులపై సంచరిస్తున్న పశువులను ఈవోపీఆర్డీ ఆర్‌ఎస్ రమేశ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వాటిని పంచాయతీ బంజరు దొడ్డిలో బంధించారు. ఐటీడీఏ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు రహదారిలో పశువులు సంచరిస్తూ పాదచారులు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నట్టు గుర్తించిన జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ వాటి నియంత్రణ బాధ్యతను ఎంపీడీవో సాయినవీన్‌కు అప్పగించారు. దీంతో రెండు రోజులుగా పంచాయతీ సిబ్బంది వాటిని తోలుకుపోయి బంజరు దొడ్డిలో బంధిస్తున్నారు. పశువుల యజమానులకు సమాచారం అందించి జరిమానాలు విధించి, తిరిగి వాటిని అప్పగిస్తున్నారు. మరోసారి పశువులను నిర్లక్ష్యంగా ప్రధాన రహదారులపై విడిచిపెడితే బంధించి వేలం వేస్తామని ఎంపీడీవో హెచ్చరించారు.

కొత్త సార్ ఎప్పుడొస్తారో?

... 5వ పేజీ తరువాయి

అప్పటి నుంచి స్థానిక జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్ ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన తెలంగాణకి చెందిన సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను స్థానిక సబ్‌కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 17న ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఆయన విధుల్లో చేరలేదు. దీంతో ఆయనను బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ, శిక్షణ పూర్తి చేసుకున్న 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సౌర్యమన్‌పటేల్‌ను స్థానిక సబ్‌కలెక్టర్‌గా నియమిస్తూ ఆగస్టు 25న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ ఉత్తర్వులు జారీ చేసి ఇప్పటికి పది రోజులు కావస్తున్నా సౌర్యమన్ పటేల్ సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించలేదు. పైగా ఆయన ఇక్కడికి వస్తారా, రారా? అనేదానిపైనా స్థానిక అధికారులకు ఎటువంటి సమాచారం లేదు. దీంతో ఆయన రాకపై అయోమయం నెలకొంది.

కల్పశ్రీని సబ్‌కలెక్టర్‌గా నియమిస్తారా?

ప్రస్తుతం రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియమితులైన 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కల్పశ్రీని స్థానిక సబ్‌కలెక్టర్‌గా నియమిస్తారనే ప్రచారం సైతం జరుగుతున్నది. ఆమె స్థానిక జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్ సతీమణి కావడంతో త్వరలో ఆమెను స్థానిక సబ్ కలెక్టర్‌గా నియమించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి ఐఏఎస్ శిక్షణ పూర్తి చేసుకున్న కల్పశ్రీని తొలుత నర్సీపట్నం సబ్‌కలెక్టర్‌గా నియమిస్తూ ఆగస్టు 17న ఉత్తర్వులు జారీ చేశారు. తరువాత ఆమెను రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ఆగస్టు 25న ఉత్తర్వులు జారీ అయ్యాయి. వాస్తవానికి అప్పట్లోనే(ఆగస్టు 17న) ఆమెను స్థానిక సబ్‌కలెక్టర్‌గా నియమిస్తే బాగుండేదని పలువురు అంటున్నారు.


విద్యార్థికి మందు వేస్తున్న ఐటీడీఏ పీవో వి.అభిషేక్

528 మందికి చర్మ వ్యాధుల పరీక్షలు

పాడేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 528 మంది గిరిజన విద్యార్థులకు చర్మ సంబంధ వ్యాధుల పరీక్షలు నిర్వహించారు. వారిలో 108 మందికి చర్మ వ్యాధులున్నట్టుగా గుర్తించారు. అనంతరం గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మందులు, సబ్బులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీవో అభిషేక్ మాట్లాడుతూ.. మార్చి, ఏప్రిల్ నెలల్లో హుకుంపేట, పాడేరు మండలాల్లోని గిరిజన విద్యార్థులకు చర్మవ్యాధుల నిపుణులతో పరీక్షలు నిర్వహించాం పెర్మెత్రిన్ సబ్బుల వినియోగం, ఐవర్ మెక్టిన్ మాత్రలు వినియోగంతో 96 శాతం మందికి చర్మవ్యాధులు తగ్గాయన్నారు. దీంతో ఏజెన్సీలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు చర్మ వ్యాధుల పరీక్షలు నిర్వహించి మందులు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, చర్మ వ్యాధుల నిపుణులు లక్ష్మీ, సరోజిని, రత్నం, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో అదుపులో జ్వరాలు

▸▸ పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక కార్యాచరణ.. రెండు రోజులు గ్రామంలో బేస్ క్యాంప్

▸▸ ఈవోపీఆర్‌డీ పాపారావు: 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


గొల్లపల్లిలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 4: మండలంలోని అమ్మవారి దారకొండ పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో జ్వరాలు అదుపులో ఉన్నాయని ఈవోపీఆర్‌డీ పాపారావు తెలిపారు. గొల్లపల్లిలో ఆదివాసీలు జ్వరాలతో బాధపడడం, ఓ గిరిజన మృతి చెందడంపై మంగళవారం 'జ్వరంతో గిరిజనుడి మృతి' శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి ప్రభుత్వం స్పందించింది. ఈ కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ గిరిజనుడు కాకూరి శ్రీనుబాబు మృతిపై విచారణ చేపట్టాలని మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలో రోగులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. గిరిజనుడు మృతిపై కుటుంబ సభ్యులను ఆడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఈవోపీఆర్‌డీ మాట్లాడుతూ మృతి చెందిన శ్రీనుబాబు ఆస్పత్రికి తరలించేందుకు నిరాకరించడంతో, వైద్య సిబ్బంది ఇచ్చిన మందులు వేసుకోకుండా పరవన మందులు తీసుకోవడం వల్ల మృతి చెందాడన్నారు. ప్రస్తుతం గ్రామంలో జ్వర బాధితులకు చికిత్స అందించామన్నారు. మంచినీటి ఊటను క్లోరినేషన్ చేయించి, గ్రామ పరిసరాల్లో బ్లీచింగ్ చల్లించి దోమల మందు పిచికారీ చేయించామన్నారు. ఇది ఇలా ఉండగా గ్రామానికి వైద్యాధికారి సందర్శించకపోవడంపై ఆదివాసీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శివ, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కైలాసపట్నం విద్యార్థులకు డౌనూరు ఆశ్రమంలో ప్రవేశాలు

కొయ్యూరు, సెప్టెంబరు 4: కైలాసపట్నం విద్యార్థులకు డౌనూరు ఆశ్రమంలో ప్రవేశాలు కల్పించారు. కోటవురట్ల మండలంలోని కైలాసపట్నం పరిశుద్ధ క్రిస్టియన్ చర్చి పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై కోలుకున్న రెల్లపాలెం ప్రాంతానికి చెందిన ఏడుగురు విద్యార్థులు బుధవారం డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో చేరారు. డౌనూరు పంచాయతీ రెల్లపాలెం గ్రామానికి చెందిన సీందరి రవి, తాంబేలు ఎలియా, ప్రభాస్, గెమ్మెలి చందు, మర్రి అలెక్స్, గెమ్మెలి దాన్యల, వంశీ, తాంబేలి శ్రీను, సీందరి చరణ్, కిల్లో మహేశ్, బెన్ను, గెమ్మెల శంకరరావు, తాంబేరి రామ, నందిని తదితరులు కేజీహెచ్‌లో చికిత్స పొంది కోలుకున్నారు. పాడేరు ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ బాలురను డౌనూరు బాలుర ఆశ్రమ పాఠశాలలోను, బాలికలను కొమ్మిక బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. విద్యార్థులు చదువుకు దూరం కాకుండా గిరిజన సంక్షేమ ఆశ్రమాలలో ప్రవేశాలకు అనుమతి ఇచ్చిన పీవోకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

భారీ వర్షం


హుకుంపేటలో హోరున పడుతున్న వాన

ముంచంగిపుట్టు/హుకుంపేట, సెప్టెంబరు 4: మన్యంలోని ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో స్థానిక ప్రధాన రహదారిపై నుంచి, డ్రైనేజీల నుంచి వర్షపు నీరు ప్రవహించింది. వాగులు, వంకలు, మత్స్యగెడ్డ పాయలు సైతం వరదనీటితో ఉధృతంగా ప్రవహించాయి. మట్టి రహదారులు అధ్వానంగా మారాయి. రాకపోకలు సాగించేందుకు పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 4: పట్టణానికి అనుకుని ఉన్న తుమ్మపాలలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఇందుకు సంబంధించి ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ కథనం ప్రకారం వివరాలి. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం తూటంగి గ్రామానికి చెందిన ప్రధాని రాంబాబు ద్విచక్ర వాహనంపై పరవాడ ఫార్మాసిటీకి వెళ్లేందుకు బుధవారం వస్తున్నాడు. ఇంతలో వెనుక నుంచి లారీ ఢీకొనడంతో నేల కొరిగాడు. దీంతో ఆటడి కుడికాలి పైనుంచి లారీ దూసుకుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాజాబాబును ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

సంక్షిప్తంగా..

చవితి ఉత్సవాలకు ముహూర్తపు రాట

సీలేరు, సెప్టెంబరు 4: సీలేరులో వర్తక సంఘ కార్యాలయం, దుర్గామాత కమ్యూనిటీ హాల వద్ద వినాయక చవితి ఉత్సవాలకు బుధవారం పందిరి ముహూర్తపు రాట కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పందిరి రాటకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ముత్తయిదువలు చేతులమీదుగా పందిరి రాటను వేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. దీంతో సీలేరులో వినాయక చవితి ఉత్సవాల సందడి మొదలైంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీ.దుర్గ, ఎంపీటీసీ సభ్యుడు పి.సాంబమూర్తి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కారే అప్పలరాజు, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, వర్తక సంఘం సభ్యులు అప్పారావు, దారబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులంతా డిశ్చార్జి

అరకులోయ, సెప్టెంబరు 4: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులంతా డిశ్చార్జి అయ్యారని సూపరింటెండెంట్ డాక్టర్ ఎలియా తెలిపారు. డుంబ్రిగుడ మండలం జామిగుడ గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో కలుషిత ఆహారం తిని 75 మంది విద్యార్థులుఅస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది చక్కటి సేవలు అందించడంతో విద్యార్థులంతా త్వరగా కోలుకున్నారని ఈ సందర్భంగా సూపరింటెండెంట్ చెప్పారు. విడతల వారీగా కొంత మందిని ఇప్పటికే డిశ్చార్జి చేయగా, మిగిలిన 15 మందిని బుధవారం పంపించామని డాక్టర్ రామ తెలిపారు.

పాఠశాలలో చేరిన విద్యార్థులు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 4: మండలంలోని జామిగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులు సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి పాఠశాలకు చేరుకున్నారని ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 30న కలుషిత ఆహారంతో తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. బాధిత విద్యార్థినులను ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలను అందించడం జరిగిందన్నారు. బాధిత విద్యార్థుసుల్లో 60 మంది కోలుకోవడంతో పాఠశాలకు తరలించామని చెప్పారు. బుధవారం మిగిలిన విద్యార్థులు సంపూర్ణంగా కోలుకోవడంతో పాఠశాలకు తరలించడం జరిగిందని ఆయన తెలిపారు.

పెన్షన్ బదిలీలకు దరఖాస్తుల స్వీకరణ

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 4: రాష్ట్రంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పెన్షన్ బదిలీ కోసం సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చునని ఎంపీడీవో కిరణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పెన్షన్ బదిలీపై ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. పెన్షన్ బదిలీకి సంబంధించి పెన్షన్ ఐడీ, బదిలీ చేసుకోవాలని భావిస్తున్న అనుకుంటున్నారో అన్ని సక్రమంగా ఉందాలని స్పష్టం చేశారు. ఇప్పుడే బదిలీ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని ఆయన చెప్పారు.

పొలంలో తెగిన విద్యుత్ తీగలు

అనంతగిరి, సెప్టెంబరు 4: కివర్ల పంచాయతీ పుతికపుట్టు గ్రామంలోని పంట పొలంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. గ్రామానికి చెందిన మాదల కొండబాబు, బల్లబోయిన తమ్మన్న మంగళవారం పొలం పనుల్లో నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఆ సమయంలో అప్రమత్తంగా ఉండడంతో పెను ప్రమాదమే తప్పిందని, లేకపోతే ప్రాణాలను కోల్పోయేవారమని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ తీగలు తెగిపడటంతో జగదలమామిడి, బోనూరు, చీడిమెట్టు, వంటలమామిడి, తాండివలస గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలతో పాటుగా తీగలను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

11న సర్వసభ్య సమావేశం

కొయ్యూరు, సెప్టెంబరు 4: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 11న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మేరీ రోజ్ తెలిపారు. ఎంపీపీ బడుగు రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి 33 పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

'అక్రమ కట్టడాలు ఆపండి'

డుంబ్రిగుడ, సెప్టెంబరు 4: మండలంలోని అరకు గ్రామంలో ఆక్రమ కట్టడాలను ఆపాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అరకు పంచాయతీ కార్యాలయ సమీపంలో ఆక్రమ కట్టడాలు జోరుగా జరుగుతున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. గిరిజనేతరులు 1/70 చట్టాన్ని తుంగలో తొక్కి ఆక్రమ కట్టడాలు నిర్మిస్తున్నప్పటికీ అధికారులు మౌనంగా ఉండడం దారుణమన్నారు. ఆక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ

సీలేరు, సెప్టెంబరు 4: గాలికొండ పంచాయతీ లోని సప్పర్ల గ్రామంలో గిరిజన రైతులకు బుధవారం వంద టన్నుల రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. మండలంలోని గాలికొండ, ఎర్రవరెండ పంచాయతీల పరిధిలో 500 మంది గిరిజన రైతులకు ఒక్కొక్కరికి పది కిలోల చొప్పున రాజ్‌మా విత్తనాలను ఉచితంగా కూటమి నాయకుల ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి ఏవో మధుసూదనరావు, సచివాలయం సిబ్బంది బలరామ్, శ్రీనివాస్, గాలికొండ ఎంపీటీసీ సభ్యులు బుజ్జిబాబు, కూటమి సభ్యులు గెమ్మెలి చంద్రరావు, పండ రామకృష్ణ, కె.లీమన్న, పాంగి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఘటనలో బాధ్యులను అరెస్టు చేయాలి

పాడేరు రూరల్, సెప్టెంబరు 4: జి.మాడుగుల మండలం బందవీధి ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల అస్వస్థత ఘటనలో బాధ్యులపై ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర బుధవారం కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికల అస్వస్థతకు తరువాత జరిగిన పరిణామాలకు బాధ్యులైన వారిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ ఘటనలో పాఠశాల యాజమాన్యం, పాటు ఏటీడబ్ల్యూవో, టీడబ్ల్యూ డీడీలను కూడా బాధ్యులను చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతోనైనా ఏజెన్సీ పాఠశాలలపై ఐటీడీఏ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. పాఠశాల యాజమాన్యాలు, అధికారులు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు విద్యార్థులపై నెపం మోపి, టీసీలు ఇచ్చి పంపిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో యాజమాన్యాలు తీరు మారాలని చెప్పారు.